క్లుప్తంగా

## నేడు బసవేశ్వర జయంతి



బసవేశ్వర స్వామి

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో శుక్రవారం మహాత్మా బసవేశ్వర స్వామి జయంతిని నిర్వహించనున్నట్లు వీరశైవ సమాజం సభ్యులు తెలిపారు. ఉదయం 8–30గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం 6గంటలకు స్వామివారికి ఊయల సేవ ఉంటుందని వెల్లడించారు. వేడుకలకు కర్ణాటక జాకస్‌పల్లి మఠాధిపతులు అభినవ శ్రీగవి సిద్దలింగేశ్వర శివాచార్య మహాస్వామి రానున్నారని పేర్కొన్నారు. వీరశైవ సమాజం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని సభ్యులు కోరారు.

## సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న నందు

అనంతగిరి: ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగికి అవకాశం కల్పించాలని బీజేపీ జిల్లా నాయకుడు వడ్ల నందు ఎన్నికల అధికారులను కోరారు. ఇదే విషయమై ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులను వివరణ కోరగా.. అర్జీ పెట్టుకున్న అందరికీ అవకాశం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నందు పేర్కొన్నారు. ఇందులో జిల్లా యువమోర్చా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి



రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

తాండూరు: తాండూరు రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం మహారాణా ప్రతాప్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్‌కుమార్.. ప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో.. సంపత్‌కుమార్ 157వ సారి రక్తదానం చేసి రికార్డు సృష్టించారు. ఇందులో రాజ్‌పుత్ సమాజం ప్రతినిధులు, స్థానిక నాయకులు ఉన్నారు.

## కమలం గూటికి గులాబీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో కమల నాథులు

తాండూరు రూరల్: మండల పరిధి జినుగుర్తిలో బీఆర్‌ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు గురువారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కాషాయం కండువాలు కప్పుకొన్నారు. పార్టీలో చేరిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ సిద్ద రామయ్య, సీనియర్ నాయకులు రాములుతో పాటు మరో 100 మంది ఉన్నారు. ఇందులో కృష్ణ ముదిరాజ్, వడ్ల విజయ్, శ్రీనివాస్, నర్సింలు, రమేష్‌లు ఉన్నారు.

## ఆర్థిక సహాయం

పెద్దేముల్: మంబాపూర్ గ్రామానికి చెందిన వడ్డే మొగులప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ నారాయణరెడ్డి.. గురువారం మొగులప్ప కుటుంబీకులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మైఫూస్, హర్షవర్ధన్ రెడ్డి ఉన్నారు.

## పోలీస్ కవాతు

షాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని సోలీపేట్, మద్దూరు, హైతాబాద్ గ్రామాల్లో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా షాబాద్ సీఐ కాంతారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పోలీసులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మరోసారి మోసపోవద్దు

- కాంగ్రెస్, బీజేపీల హామీలు నీటి మీద రాతలు
- పేదలు, రైతులు గోస ఆ పార్టీలకు పట్టదు
- బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



పెద్దేముల్: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ప్రమోదిని రెడ్డి



మోమిన్‌పేట: ఇబ్రాచిట్టంపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

నవాబుపేట: 'కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇస్తున్న హామీలు నీటి మీద రాతలు. వారి మాటలు నమ్మి మరో సారి మోసపోవద్దు' అని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండల పరిధి మైతాప్‌ఖాన్‌గూడ, ఎల్లకొండ, లింగంపల్లి, పులుమామడి గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. 70 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, పదేళ్ల పాలనలో బీజేపీ.. చేవెళ్లకు చేసిందేమీ లేదని, ఇన్నాళ్లు చేయని వారు ఇప్పుడు ఏం చేస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అంటేనే రైతులు, పేదల పార్టీ అని, దేశంలోనే రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ ఇచ్చిన ఏకైక పార్టీ అని పేర్కొన్నారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కసాని జ్ఞానేశ్వర్ పేదల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి అని, ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఎంపీటీసీలు మాణిక్‌రెడ్డి, విజయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు భరత్‌రెడ్డి, ప్రకాశం, దర్శన్, సుధాకర్‌రెడ్డి, ఏసుదాస్, నర్సింలు, శాంతకుమార్, కదీర్, భాస్కర్, పురుషోత్తం ఉన్నారు.

**కాసానిని గెలిపించాలి**

దోమ: ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించుకోవాలని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా మండల కేంద్రం ఉపాధిహామీ పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల పేరుతో మభ్యపెట్టి ఏ ఒక్క పథకం పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఉమ్మడి జిల్లాలో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, ఆయనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాష, వార్డు మాజీ సభ్యులు సాయిలు, మైను, శ్రీనివాస్, డప్పు రమేశ్, రాములు, నవీన్, మైనొద్దీన్ ఉన్నారు.

**అమలు సాధ్యం కానీ హామీలతో..**

బంట్వారం: కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని ఆ పార్టీ కోట్‌పల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓగులాపూర్ రాములు ధీమా వ్యక్తంచేశారు. కోట్‌పల్లి మండల పరిధి పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి పనుల ప్రదేశంలో.. కాసానికి గెలిపించాలని కూలీను అభ్యర్థించారు. కేసీఆర్ పాలనలోనే తెలంగాణ బాగుండేదని, ఆచరణకు అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

**రంజిత్‌రెడ్డి నమ్మక ద్రోహి**

పెద్దేముల్: ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి నమ్మక ద్రోహం చేశారని వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదిని రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల పరిధి కందనెల్లి తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. గ్యారంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు, ఓటువేసి మోసపోవద్దని సూచించారు. గతంలో రంజిత్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి, కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. ప్రస్తుత ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో మహిళా కన్వీనర్ శకుంతల తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత**

మర్పల్లి: అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలయిందని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మధుకర్ ఆరోపించారు. మండల పరిధి బూచన్‌పల్లిలో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమయిందని విమర్శించారు. అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలంటే.. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా కాసానిని గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందులో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

## జిల్లాను రద్దు చేసే కుట్ర

మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: వికారాబాద్ జిల్లాను రద్దు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అనుమానం వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి సయ్యద్‌అల్లీపూర్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. గడిచిన శాసనసభ ఎన్నికల్లో అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రుణమాఫీ చేస్తానని చెప్పి ఇప్పటి వరకు చేయలేదని, వృద్ధులకు నెలకు రూ.4వేల పింఛన్, మహిళకు రూ.2500లు, నిరుద్యోగులకు రూ.3వేల భృతి, కల్యాణలక్ష్మి, రైతు భరోసా ఏమయ్యాయని ఆనంద్ ప్రశ్నించారు. మరోసారి నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని, కారు గుర్తుకు ఓటువేసి, పార్టీ అభ్యర్థి కాసానిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, యువ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు హరిశంకర్, కాశీరాం, సత్యనారాయణరెడ్డి, అనంతయ్య, లక్ష్మయ్య, కిష్టయ్య, బాబుమియా, సర్దార్, రవీందర్ నాయక్, అనంత్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి ఉన్నారు.

# గ్యారంటీల పేరుతో మోసం

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఆ పథకాల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు మళ్లీ వస్తున్నారని, ఈ సారి ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటువేసి, బీఆర్‌ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో జెడ్పీటీసీ మహిపాల్ ముదిరాజ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు నరోత్తం రెడ్డి, రమేశ్ ఉన్నారు.

## సభ్యులు లేక.. సమావేశం వాయిదా

బొంరాస్‌పేట: మండల ప్రాదేశిక సభ్యులు లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం.. మధ్యాహ్నం వరకు సభ్యుల కోసం అధికారులు ఎదురు చూశారు. ప్రత్యేక పాలనలో చేపట్టిన గ్రామస్థాయి అభివృద్ధి పనులు, నివేదికలతో పడిగాపులు కాశారు. 15మంది ఎంపీటీసీ సభ్యులున్న మండలంలో కోరం లేక, సమీక్ష వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ హేమిబాయి, ఎంపీడీఓ శ్రీదేవి ప్రకటించారు.

# 'ఉపాధి' కల్పించింది కాంగ్రెస్సే..

- బీజేపీ, బీఆర్‌ఎస్‌తో ఒరిగిందేమీ లేదు
- హస్తంతోనే అందరికీ మేలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు



మర్పల్లి: కల్‌ఖోడ గ్రామంలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: ఉపాధిహామీ పథకం అమలు చేసి, వలసలను అరికట్టింది కాంగ్రెస్ పార్టీనేని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పనగారి కొండల్‌రెడ్డి గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండల పరిధి దామస్తాపూర్, కల్‌ఖోడ గ్రామాల్లో ఇంటింటికీ, ఉపాధి పనుల ప్రదేశాల్లో పార్టీ రాష్ట్ర నాయకులు జి.సుభాష్ యాదవ్, శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే.. రాష్ట్రంతో దేశానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గడిచిన పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో దేశ ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. పేద ప్రజల కోసం పాటు పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు రాచన్న, పాండురంగారెడ్డి, మల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఐనెల్లి రాచన్న, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ప్రభాకర్, రాములు ఉన్నారు. అంతకు ముందు దామస్తాపూర్ గ్రామంలో పార్టీ రాష్ట్ర నాయకుడు జి.సుభాష్‌యాదవ్ ఇంటింటి ప్రచారం చేశారు.

**అర్హులందరికీ.. గ్యారంటీలు**

పూడూరు: అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గొంగుపల్లి, రాకంచర్ల, చన్గోముల్, కండ్లపల్లి, పూడూరు తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి రెడ్డిని గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరాలంటే.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఇందులో నాయకులు రమేష్, గోవర్ధన్, వీరేశం, వెంకటేశ్, దయాకర్, రాజు, జావీద్, మధు, శ్రీనివాస్, ఆంజనేయులు, రవి, సత్తయ్య ఉన్నారు.

**కాంగ్రెస్‌లోకి వలసలు**

కొడంగల్: బీఆర్‌ఎస్ శ్రేణులు పలువురు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏన్గుల భాస్కర్, నందారం ప్రశాంత్, మహ్మద్ యూసుఫ్ ఉన్నారు.

**రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం**

యాలాల: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ యువజన విభాగం సీనియర్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండల పరిధి అన్నసాగర్ గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు.

**మతోన్మాద పార్టీని నమ్మొద్దు**

తాండూరు టౌన్: మతోన్మాద పార్టీ బీజేపీని నమ్మరాదని తెలంగాణ జనసమితి నియోజకవర్గ ఇన్‌చార్జి, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 34వ వార్డులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడారు. మతం పేరు చెప్పి ఓట్లు అడగడం తప్ప, అభివృద్ధి, పేదరిక నిర్మూలన గురించి బీజేపీ ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్.. ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సుభిక్షమైన పాలన రావాలంటే.. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

**ప్రజలకు చేసిందేమి లేదు**

అనంతగిరి: పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, సీపీఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి వై.గీతలతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదని, కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు.



యాలాలలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

మతతత్వ బీజేపీని ఓడించి, కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు మల్లేశం ఉన్నారు.

**కార్మిక చట్టాల నిర్వీర్యం**

దోమ: కార్మిక వ్యతిరేఖ విధానాలను అనుసరిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య కోరారు. మండల పరిధి రాకొండ గ్రామంలో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం.. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు, కార్పొరేట్ శక్తులకు కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు యత్నిస్తుందని విమర్శించారు. అ లాంటి పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చేతి గుర్తుకు ఓటు వేసి, కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

## బీజేపీని గద్దె దించాలి..



మాట్లాడుతున్న చెన్నయ్య

అనంతగిరి: రిజర్వేషన్లతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే బీజేపీని గద్దె దించి, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడారు. బీజేపీ పాలనలో దళిత గిరిజన, మైనార్టీలతో పాటు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దళితులకు మూడు ప్రత్యేక కార్పొరేషన్లతో పాటు అన్ని కులాల అభివృద్ధికి కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దళిత బహుజనులు మరింత అభ్యున్నతి చెందాలంటే కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం అయ్యాయని, దళితులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఆ పార్టీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించి.. బీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇందులో మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వర్కింగ్ చైర్మన్ రమేష్, జిల్లా నాయకులు వసంత్‌కుమార్ ఉన్నారు.

# 'కొండా' అభివృద్ధే కనిపిస్తోంది

- ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిందేమీ లేదు
- మోదీ పాలనను కోరుకుంటున్న ప్రజలు
- ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు



తాండూరు రూరల్: సంగెంకలాన్‌లో ఉపాధి పనుల ప్రదేశంలో ప్రచారం చేస్తున్న కమలనాథులు

మోమిన్‌పేట: పార్లమెంటు నియోజకవర్గ పరిధి గ్రామాల్లో ఇప్పటికీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిందేమీ లేదని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహ్మారెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండల పరిధి మొరంగపల్లి గ్రామంలో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండాకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్ల ప్రధాని మోదీ పాలనలో ఒక్క స్కాం జరగలేదని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో దేశం అల్లర్లతో అట్టుడికి పోయేదని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలో దేశ ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, మరోసారి మోదీ పాలనను కోరుకుంటున్నారని వెల్లడించారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే వృథా అని, కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి, కొండాను గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, భుజంగ్‌రెడ్డి, మల్లేశం, రాజు ఉన్నారు.

**కొండాను ఆశీర్వదించండి..**

తాండూరు రూరల్: బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి కోరారు. మండల పరిధి సంగెంకలాన్ గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటువేసి, కొండాను ఆశీర్వదించాలని కూలీలను అభ్యర్థించారు. ఇందులో ప్రవీణ్‌కృష్ణ, వినోద్, గణేశ్, వేణు, దిలీప్, దత్తు, ప్రభు, మారుతీ, ఆదిత్, మధు, రాములు ఉన్నారు.

**బీజేపీతోనే దేశాభివృద్ధి**

పెద్దేముల్: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ అన్నారు. మండల పరిధి అడ్కిచెర్ల గ్రామంలో కార్నర్ మీటింగులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ అని అభివర్ణించారు. ఆ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వీరు శివాజీ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కృష్ణ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాంసాగర్, నాయకులు వెంకటేశం, అంజి, విఠల్‌రెడ్డి ఉన్నారు.

**చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేస్తాం**

మర్పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగుర వేస్తామని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మర్పల్లిలో నియోజకవర్గం కో ఆర్డినేటర్ వడ్ల నందు, పార్టీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బన్నే మల్లేశ్ యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి, కొండాను గెలిపించాలని కోరారు. ఇందులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జి నర్సింహ్మారెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఓబీసీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి సీబీఎస్ నాగన్న, బలరాం గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మధు, ఎస్టీసెల్ యువమోర్చా అధ్యక్షుడు రాకేష్, మండల ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రవిందర్ రెడ్డి, దామస్తాపూర్ మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, శాంతప్ప, కోట్‌మర్పల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

## ఓటు వజ్రాయుధం

కుల్కచర్ల: అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏపీఎం శోభ కోరారు. గురువారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. సమాజంలో మార్పులకు శ్రీకారం చుట్టేందుకు, పాలనాపరంగా సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆమె వెల్లడించారు.

## అంత్యక్రియలకు సాయం

ధారూరు: అస్వస్థతకు గురై మృతి చెందిన ఉపాధి కూలీ కావలి లక్ష్మి అంత్యక్రియలకు వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. నగదును మాజీ సర్పంచ్ అనంతయ్య ద్వారా మృతిరాలి భర్తకు అందజేశారు.

## రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి తథ్యం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కాంగ్రెస్‌లో చేరిన వారితో స్పీకర్

ధారూరు: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలు మోసపోయారని, ఆ పార్టీ పీడ పోయిందని భావించి కాంగ్రెస్‌లో చేరుతున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండలం పరిధి మైలారం కొత్త తండాకు చెందిన 50 మంది బీఆర్‌ఎస్ శ్రేణులు వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో గురువారం స్పీకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని బలపరిచి, రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెలిపాడ్ సిద్ధం



అనంతగిరి: వికారాబాద్‌లో శనివారం జరిగే అమిత్ షా సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గురువారం హెలిపాడ్‌ను సిద్ధం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి హెలిపాడ్, సభాస్థలి, పార్కింగ్ తదితర వాటిని దగ్గరుండి పరిశీలించారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా శంకర్‌యాదవ్



బంట్వారం: యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా బంట్వారానికి చెందిన శంకర్‌యాదవ్ నియమితులయ్యారు. గురువారం వికారాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం శంకర్‌యాదవ్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.